సాక్షి పెద్దపల్లి

మంగళవారం ; 22 ; ఆగస్టు ; 2023



చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పెద్దపల్లిరూరల్: వృద్ధులు, పెన్షనర్లు చట్టాల గురించి తెలుసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి రాణి అన్నారు. జెడ్పీ బాలుర పాఠశాలలో అవగాహన కల్పించారు.



కొత్తపల్లిలో చిరుత సంచారం

మండలంలోని కొత్తపల్లిలో చిరుత సంచరించింది. అధికారులు చిరుత పాదముద్రలు సేకరిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ మాధవి

సుల్తానాబాద్‌రూరల్: పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ మాధవి అన్నారు. ఉన్నతి అభ్యసన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని మోడల్ స్కూల్‌లో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు, లర్నింగ్ అవుట్ సాధించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పటిష్టంగా అమలు చేసి లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. పర్యవేక్షణ అధికారి షేక్, కోర్సు డైరెక్టర్ విజయ్‌కుమార్, మోడల్‌స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘునాథ్, ఎంఆర్‌సీలు సుదర్శన్, ఆగయ్య, రమేశ్, సంపత్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను చూసుకోవడం పిల్లల కనీస బాధ్యత



అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్

మంథని: వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదేనని మంథని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్ అన్నారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్‌డే సందర్భంగా మంథని కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సీనియర్ సిటిజన్ యాక్ట్–2007 ప్రాముఖ్యతను వివరించారు. బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రఘోత్తంరెడ్డి, సెక్రటరీ ముస్కుల సహేందర్ రెడ్డి, అడిషనల్ పీపీ ప్రణయ్, ఏజీపీ శశికాంత్ కాచే, న్యాయవాదులు బి.ఆంజనేయులు, కట్కం శ్రీనివాస్, శశిభూషణ్ కాచే, పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కేటీ రామారావు (సిరిసిల్ల)




గంగుల కమలాకర్(కరీంనగర్)



కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి)



సుంకె రవిశంకర్ (చొప్పదండి)



రసమయి బాలకిషన్ (మానకొండూర్)



ఎం. సంజయ్ (జగిత్యాల)



ఒడితెల సతీశ్(హుస్నాబాద్)



పుట్ట మధు (మంథని)



కె. చందర్(రామగుండం)



మనోహర్ రెడ్డి (పెద్దపల్లి)

◀ పాతకాపులు



ఇన్ ▶



పాడి కౌశిక్ రెడ్డి (హుజూరాబాద్)



కల్వకుంట్ల సంజయ్ (కోరుట్ల)



చల్మెడ లక్ష్మీనర్సింహారావు(వేములవాడ)

- వేములవాడ, హుజూరాబాద్, కోరుట్లకు నూతన అభ్యర్థులు
- మిగిలిన పదిస్థానాల్లో పాత నాయకులే
- 13లో ఏడుగురు ఓసీ, ముగ్గురు బీసీ, ముగ్గురు ఎస్సీ నేతలు
- మూడోసారి టికెట్ దక్కించుకున్న ఏడుగురు సీనియర్లు
- వివాదాలున్న స్థానాల్లో పాతకాపులే

కారులో ముగ్గురు కొత్తవారు!

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

భారత రాష్ట్రసమితి(బీఆర్‌ఎస్) తన అభ్యర్థులను ప్రకటించింది. 13 అసెంబ్లీ స్థానాలున్న విశాల ఉమ్మడి జిల్లా అభ్యర్థుల జాబితాను సోమవారం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రకటించగానే.. పాత జిల్లాలో గులాబీ శ్రేణుల సంబురాలు మొదలయ్యాయి. ఇటీవల జాబితాలో ఉమ్మడి జిల్లాలో భారీగా మార్పులు ఉంటాయని ప్రచారం జరిగిన నేపథ్యంలో సీఎం జాబితాపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కానీ.. పాత జిల్లాలో పదిమందిని పాత వారిని, ముగ్గురు కొత్తవారి పేర్లు ప్రకటించి సీఎం.. అందరి అంచనాలను తలకిందులు చేశారు. అంతా ఊహించినట్లుగా వేములవాడ అభ్యర్థిని అందరి కంటే ముందే మారుస్తున్నామని సీఎం ప్రకటించారు. పౌరసత్వం వివాదంలో ఆయన మార్పు అనివార్యమైందని వివరించారు. ఆయన స్థానంలో చెలిమెడ లక్ష్మీనర్సింహారావు పేరును ఖరారు చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్ రావు కుమారుడు డాక్టర్ కె.సంజయ్‌ను ప్రకటించారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న విద్యాసాగర్‌రావు కోరిక మేరకు సంజయ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇక హుజూరాబాద్‌లో అంతా అనుకున్నట్లుగా ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు సిట్టింగులను మార్చగా ఇందులో జిల్లాకు చెందినవారే ఇద్దరు కావడం విశేషం.

పదిమంది పాతకాపులే..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో మూడుస్థానాల్లో అభ్యర్థులు మారగా, మిగిలిన 10 స్థానాల్లో సీనియర్లే ఉన్నారు. అందులో సిరిసిల్ల నుంచి మంత్రి కేటీఆర్, కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్, ధర్మపురి నుంచి మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీచేస్తారు. చొప్పదండి నుంచి సుంకె రవిశంకర్, మానకొండూరు నుంచి రసమయి బాలకిషన్, హుస్నాబాద్ నుంచి సతీశ్ బాబు, జగిత్యాల నుంచి సంజయ్, పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండం నుంచి కోరుకంటి చందర్, మంథని నుంచి పుట్ట మధు బరిలో దిగనున్నారు. ఇందులో సిరిసిల్ల, కరీంనగర్, హుస్నాబాద్, మానకొండూరు, జగిత్యాల మినహా మిగిలిన చొప్పదండి, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథనిలో ఎమ్మెల్యేలకు వ్యతిరేక పవనాలు వీచాయి. మంత్రి ఈశ్వర్ పెద్దపల్లి పార్లమెంటుకు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అదే సమయంలో చొప్పదండి, రామగుండం, మంథని, పెద్దపల్లి ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా స్థానిక నేతలు తిరుగుబాటు చేశారు. మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, ఈశ్వర్‌ల చొరవతో అవన్నీ సద్దుమణిగాయి.

కులాల వారీగా..

13 అసెంబ్లీ స్థానాల్లో ఏడుగురు ఓసీ అభ్యర్థులు ఉన్నారు. ముగ్గురు బీసీలు, ముగ్గురు ఎస్సీలకు అవకాశం దక్కింది. ఇందులో కేటీఆర్, డాక్టర్ సంజయ్, డాక్టర్ కె.సంజయ్‌కుమార్, చలిమెడ లక్ష్మీనర్సింహరావు వెలమ సామాజిక వర్గానికి చెందిన వారు. పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి, హుజూరాబాద్ నుంచి పాడి కౌశిక్‌ది రెడ్డి సామాజిక వర్గం. హుస్నాబాద్ నుంచి సతీశ్‌బాబు బ్రాహ్మణ(కరణం) కాగా, కరీంనగర్ నుంచి కమలాకర్, రామగుండం నుంచి కోరుకంటి చందర్, మంథని నుంచి పుట్ట మధు.. ఈ ముగ్గురూ మున్నూరుకాపు సామాజికవర్గం వారు కావడం విశేషం. సుంకె రవిశంకర్ (చొప్పదండి), రసమయి బాలకిషన్(మానకొండూరు) మాదిగ, కొప్పుల ఈశ్వర్(ధర్మపురి) మాల సామాజిక వర్గానికి చెందివారు కావడం గమనార్హం.

ఏడుగురు మూడోసారి...

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పాతజిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో ఏడుగురు నాయకులు బీఆర్‌ఎస్ టికెట్‌పై మూడోసారి పోటీ చేస్తున్నారు. అందులో కేటీఆర్(సిరిసిల్ల), సతీశ్‌బాబు(హుస్నాబాద్), మనోహర్‌రెడ్డి(పెద్దపల్లి), పుట్ట మధు(మంథని), గంగుల కమలాకర్ (కరీంనగర్), కొప్పుల ఈశ్వర్(ధర్మపురి), రసమయి బాలకిషన్ (మానకొండూరు) ఉన్నారు. డాక్టర్ సంజయ్(జగిత్యాల), సుంకె రవిశంకర్(చొప్పదండి) రెండోసారి బీఆర్‌ఎస్ టికెట్‌పై బరిలోకి దిగనున్నారు. ఇక మిగిలిన నలుగురు లక్ష్మీనర్సింహారావు(వేములవాడ), పాడికౌశిక్‌రెడ్డి(హుజూరాబాద్), డాక్టర్ కె.సంజయ్ (కోరుట్ల), కోరుకంటి చందర్(రామగుండం) తొలిసారిగా బీఆర్‌ఎస్ బీఫాం మీద పోటీ చేయనున్నారు.

వాటర్ ట్రీట్మెంట్ విధానంపై సహాయకులకు అవగాహన



వాటర్‌ట్రీట్మెంట్ ప్రదర్శిస్తున్న అధికారులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ శివారులో ఉన్న 160 ఎంఎల్‌డీ మిషన్ భగీరథ ట్రీట్మెంట్ ప్లాంట్ ప్రాంగణంలో సోమవారం నూతనంగా నియమించిన 30 మంది సహాయక సిబ్బందికి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ సీహెచ్.అమరేంద్ర మాట్లాడుతూ ధర్మారం, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, జూలపల్లి, రామగిరి, సుల్తానాబాద్, కమాన్‌పూర్, ముత్తారం, ఓదెల, ఎలిగేడు మండలాలకు భగీరథ శాఖలో నూతనంగా సహాయకులను నియమించామన్నారు. వీరికి వాటర్ ట్రీట్మెంట్‌పై అవగాహన సదస్సును నిర్వహించామన్నారు. ముఖ్యంగా తాగునీటి వనరులు, తాగునీటి ఉపయోగాలు, పని విధానంతో పాటు ప్రజలకు సరఫరా చేసే నీటి గుణాలు, కలుషిత నీరు తదితర అంశాలను గుర్తించాల్సిన విధానా లను వివరించామన్నారు. మిషన్ భగీరథ ఈఈ (ఇంట్రా) జి.శ్రీనివాస్, ఈఈ (గ్రిడ్) పూర్ణచందర్, డీఈఈ ఏ.సతీశ్, మంథని డీఈఈ దాసరి రాజ్‌కుమార్, రామగుండం డీఈఈ ఎస్.సునీల్, ఈఈలు, ఏఈఈలు, సూపరింటెండెంట్లు షేక్ రహీం తదితరులున్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బందంపల్లి ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. పాఠ్యపుస్తకాలు, వర్క్‌పుస్తకాల్లోని అంశాలపై అడిగి విషయ పరిజ్ఞానాన్ని గ్రహించారు. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులను హెచ్‌ఎం సరళను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సెంటర్‌ను కూడా పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను గ్రహించిన కలెక్టర్ కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, ఫ్లోరింగ్ మరమ్మతులు, టాయిలెట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈని ఆదేశించారు.

ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కారం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ప్రజావాణికి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ అన్నారు. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని పెద్దపల్లి మండలం పాలితం గ్రామానికి చెందిన పుట్ట లక్ష్మి కోరింది. ఓదెల మండలం జీలకుంటలో చేపట్టిన ఇంటి నిర్మాణానికి అనుమతినివ్వాలంటూ గ్రామానికి చెందిన అగ్గి రమేశ్ విన్నవించుకున్నారు. జిల్లాస్థాయి ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తో కలిసి పార్టీశ్రేణుల సంబరాలు



గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మేయర్, డిప్యూటీ మేయర్, నాయకుల సంబరాలు



మంథనిలో నృత్యాలు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు

పెద్దపల్లిరూరల్/గోదావరిఖని/మంథని: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడంపై కార్యకర్తల ఆనందాలు మిన్నంటాయి. పెద్దపల్లితోపాటు రామగుండం అసెంబ్లీ స్థానాలకు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం.. మంథని నుంచి పుట్ట మధు పేరును ప్రకటించడంతో ఆయా నియోజకవర్గాల్లో కార్యకర్తలు, నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు మాట్లాడుతూ కోరుకంటికి టికెట్ కేటాయించడం ప్రజాసేవకు నిదర్శనమన్నారు. కార్పొరేషన్ కో–ఆప్షన్ మెంబర్ తస్నీమ్‌భాను ఆధ్వర్యంలో మిఠాయిలు పంచిపెట్టారు. కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, ఇంజపురి పులేందర్, సాగంటి శంకర్, కన్నూరి సతీష్‌కుమార్, బాల రాజ్‌కుమార్, అడ్డాల స్వరూప, జనగామ కవితసరోజిని, కల్వచర్ల కృష్ణవేణి, కో–ఆప్షన్ మెంబర్ పాల్గొన్నారు.

మంథనిలో బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు

బీఆర్‌ఎస్ మంథని అభ్యర్థిగా పుట్ట మధును ప్రకటించడంపై శ్రేణులు నియోజకవర్గం వ్యాప్తంగా సంబురాలు జరుపుకున్నారు. ప్రధాన చౌరస్తాలో బాణాసంచా కాల్చి.. నృత్యాలు చేస్తూ ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

హ్యాట్రిక్ విజయం సాధిస్తాం

పెద్దపల్లి నియోజకవర్గం నుంచి దాసరి మనోహర్‌రెడ్డి మూడోసారి గెలవడం ఖాయమని, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఉప్పు రాజ్‌కుమార్, మర్కు లక్ష్మణ్, మార్కెట్ చైర్మన్ జడల సురేందర్ అన్నారు. మనోహర్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందనల్లో ముంచెత్తారు. పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామానికి చెందిన పలువురు నాయకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తీగల సదయ్య, బయ్య కొమురయ్య, గనెబోయిన మల్లేశం, శ్రీనివాస్ తదితరులున్నారు. పట్టణ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ పథకం కింద రూ. 25కోట్లు కేటాయించిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి క్షీరాభిషేకం చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై క్యూసీఐ బృందం పరిశీలన



సులభ్ కాంప్లెక్స్‌ను తనిఖీ చేస్తున్న సుమిత్

కోల్‌సిటీ: కార్పొరేషన్‌లో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) బృందం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై వివరాలు సేకరిస్తోంది. క్యూసీఐ ప్రతినిధులు సుమిత్, భరత్, శ్రీనివాస్, వెంకటేశ్ నాలుగు బృందాలుగా విడిపోయి పలు డివిజన్లలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. పట్టణంలోని పబ్లిక్, కమ్యూనిటీ టాయిలెట్ల పనితీరును తనిఖీ చేసి, ఆన్‌లైన్‌లో ఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రశ్నావళిలో వివరాలను నమోదు చేశారు. ఒక్కో కమ్యూనిటీ టాయిలెట్‌ను సుమారు గంటపాటు పరిశీలించి అక్కడిక్కడే వివరాలు, ఫొటోలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

కొత్తవారికే లక్కు..!

- మద్యం షాపులకు డ్రా ప్రశాంతం
- కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ ప్రక్రియ

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో మద్యం పాలసీ 2023–25కు సంబంధించి దుకాణాల కేటాయింపు కోసం సోమవారం జిల్లాకేంద్రంలోని స్వరూప గార్డెన్స్‌లో 77షాపులకు లక్కీ డ్రా నిర్వహించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నేతృత్వంలో షాపుల కేటాయింపును పూర్తిగా వీడియోగ్రఫీ సమక్షంలో విజేతలను ఎంపిక చేశారు. జిల్లాలో 77 దుకాణాలకు ఈసారి రికార్డుస్థాయిలో 2022 దరఖాస్తులు వచ్చాయి. ముందుగా ఆ దుకాణాలకు సంబంధించి దరఖాస్తుదారులను పిలిచి వారి సమక్షంలో సీరియల్ నంబర్ ఆధారంగా టోకెన్లను డబ్బాలో వేసి కలెక్టర్ చేతుల మీదుగా డ్రా తీశారు. లక్కీ డ్రాలో షాపులు చేజిక్కించుకున్న యజమానులు రెండేళ్ల లైసెన్స్‌కు సంబంధించిన రుసుం మొత్తంలోని ఆరోవంతు భాగాన్ని అక్కడిక్కడే బ్యాంకు కౌంటర్లలో డీడీలు చెల్లించారు. వారందరూ డిసెంబర్ ఒకటి నుంచి తమ దుకాణాలు తెరిచి లిక్కర్ అమ్మకాలు చేపట్టవచ్చు.

రిజర్వేషన్ అనుకూలంగా మల్చుకున్నా..

ఏళ్లుగా మద్యం వ్యాపారంలో ఉన్నవారు రిజర్వేషన్లను అనుకూలంగా మల్చుకుని, గౌడ, ఎస్సీ కేటాయించిన షాపుల్లో తమ అనుచరులు, బంధువులతో టెండర్లు వేయించారు. వందల సంఖ్యలో దరఖాస్తు చేసినప్పటికీ లాటరీలో వారికి సింగిల్ డిజిట్ దుకాణాలకు మించిరాలేదు. 77 షాపుల్లో అత్యధికంగా కొత్తవారికే షాపులు దక్కాయి. ఈసారి 8మంది మహిళలకు షాపులు వరించాయి.

చక్రం తిప్పనున్న వ్యాపారులు

లిక్కర్ మాఫియాలో రాటుదేలిన వ్యాపారుల్లో కొందరికి దుకాణాల రాకపోవడం.. మద్యం వ్యాపారంతో సంబంధంలేని వ్యక్తులకు దుకాణాలు తగలడంతో వ్యాపారులు ఒకింత నిరాశలో ఉన్నారు. వందల సంఖ్యలో దరఖాస్తులు వేసినా లాటరీ తగలనివారు గుడ్‌విల్ చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నారు.

భారీ బందోబస్తు

స్వరూప గార్డెన్ హాల్‌లో డ్రా సందర్భంగా దరఖాస్తుదారులు వారి బంధువులు, స్నేహితులతో భారీగా వచ్చారు. వారి వాహనాలతో సందడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



డ్రా తీస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

అదృష్టం వరించినా...

జిల్లాలో లక్కీ డ్రా తీస్తున్న సందర్భంలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఓదెల మండలంలోని కొలనూర్ షాపు నంబర్ 31కి పాకాల కరుణాకర్ రెడ్డి (టోకెన్ నంబర్ 13) టెండర్ వేశారు. కలెక్టర్ లక్కీ డ్రాతీయగా 13 నంబర్ మీద అతడికే షాపు వచ్చింది. అయితే అతడు డ్రాకు గైర్హాజరు కావటంతో అతడి కోసం అరగంటపాటు అధికారులు వేచిచూశారు. నిబంధనల ప్రకారం టెండర్ వేసి దరఖాస్తుదారుడు లేకపోతే అతడి టోకెన్ నెంబర్ పక్కకు పెట్టి మరోసారి డ్రా తీయవచ్చు. దీంతో కలెక్టర్ సూచనమేరకు మరోసారి డ్రాతీయగా జంగా విజయపాల్‌రెడ్డిని అదృష్టం వరించింది.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- అభ్యంతరాల స్వీకరణకు సెప్టెంబర్ 19వరకు గడువు
- తుది జాబితా అక్టోబర్ 4న విడుదల

సాక్షి పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. కొద్దిరోజులుగా పేర్లలో మార్పులు చేర్పులు, చనిపోయిన, వలస వెళ్లిన వారి పేర్లు తొలగింపు, కొత్తగా ఓటు హక్కు కల్పిస్తోంది. బోగస్ ఓటర్లు లేకుండా పక్కాగా జాబితా తయారు చేసి, సోమవారం ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించింది. దీనిలో గత జాబితాతో పొల్చితే పెద్దపల్లిలో 257ఓట్లు తగ్గగా, మంథనిలో 427ఓట్లు పెరిగాయి. ప్రస్తుతం విడుదల చేసిన ఓటరు ముసాయిదా జాబితా ప్రకారం మూడు నియోజకవర్గాల్లో కలిపి 6.78లక్షల మంది ఓటర్లు ఉన్నారు.

అభ్యంతరాలు.. పరిశీలనకు గడువు

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన ఎన్నికల సంఘం అభ్యంతరాలను సెప్టెంబరు 19వరకు స్వీకరించనుంది. 2023 అక్టోబరు 1నాటికి 18ఏళ్లు నిండి, కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునేవారు ఫారం–6 ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. ఆ రెండు రోజుల్లో బీఎల్‌వోలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు. అక్కడే మార్పులు, చేర్పులు సైతం చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత మరోసారి పరిశీలించి అక్టోబర్ 4న తుదిజాబితాను ప్రకటించనున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
రామగుండం	1,05,301	1,02,585	26	2,07,912
మంథని	1,11,691	1,13,204	07	2,24,902
పెద్దపల్లి	1,22,716	1,23,050	08	2,45,774
మొత్తం	3,39,708	3,38,839	41	6,78,588

క్లుప్తంగా

గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు

రామగుండం: మహారాష్ట్ర నుంచి రైలులో గంజాయి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామగుండం ఇన్‌చార్జి ఎస్సై జీవన్ వివరాల మేరకు.. గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన శనిగరపు రఘువీర్ మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి తీసుకొని ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో రామగుండంకు తీసుకువస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రైల్వేస్టేషన్‌లో అతడిని అదుపులోకి తీసుకొని సోదా చేయగా 620 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితుడిని రామగుండం తహసీల్దార్ ఎదుట పోలీసులు హాజరుపరిచారు.

పెద్దపల్లిలో బీజేపీ జెండా ఎగురవేస్తాం



రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎలిగేడు: పెద్దపల్లిలో బీజేపీ జెండాను ఎగురవేస్తామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ర్యాకల్‌దేవుపల్లి–రాములపల్లిలోని నాగలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలానికి పోలీస్‌స్టేషన్‌ను తేవడంలో ప్రస్తుత పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. నాయకులు మీస అర్జున్‌రావు, లింగారెడ్డి, మామిడాల రమేశ్, గర్రెపల్లి నారాయణస్వామి, సురేందర్‌రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

లైఫ్‌సైన్స్‌పై ట్రినిటీ విద్యార్థులకు అవగాహన



చెరువు వద్ద అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట పెద్దచెరువు వద్ద సోమవారం ట్రినిటీ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులకు లైఫ్ సైన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెరువును సందర్శించిన వృక్ష శాస్త్ర అధ్యాపకులు రామ్ చందర్ మంచినీటిలో పెరిగే ఆల్గే, ఆహార గొలుసు, ఆక్సిజన్ ఉత్పత్తికి కీలక పాత్ర పోషించే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు విద్యతోపాటు విషయ పరిజ్ఞానంపై మేధస్సును పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ నీతా రెడ్డి, అధ్యాపకులు మమత పాల్గొన్నారు.







ఘనంగా నాగుల పంచమి

నాగుల పంచమి సందర్భంగా మహిళలు పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాకేంద్రంలోని సాగర్‌రోడ్డు వద్దనున్న పుట్టలో పాలు పోసి నాగదేవతకు మొక్కులు చెల్లించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

కొత్తపల్లిలో చిరుత సంచారం



చిరుత పాదముద్రలు సేకరిస్తున్న అధికారులు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కొత్తపల్లి గ్రామశివారులో ఆదివారం రాత్రి లేగదూడను చిరుత చంపివేసింది. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి కథనం ప్రకారం.. కొత్తపల్లికి చెందిన అజ్మీర మోతీలాల్ తన పశువులను గ్రామ శివారు గుట్ట సమీపంలోని తన పొలం వద్ద రాత్రి కట్టేసి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా లేగదూడ కనిపించలేదు. సమీపంలో వెతుకుతుండగా గుట్ట చెట్లపొదల్లో చనిపోయి ఉంది. లేగదూడను చిరుత చెట్ల పొదల్లోకి లాక్కెళ్లి చంపిన తర్వాత కొంత భాగం తిని వదిలేసి వెళ్లింది. పశువులు ఉన్న ప్రాంతం నుంచి చనిపోయిన లేగదూడ వరకు చిరుత పాదముద్రలను అటవీశాఖ అధికారులు సేకరించారు. అనంతరం పశువైద్యాధికారి కిషోర్ ఘటన స్థలంలోనే లేగదూడకు పంచనామా నిర్వహించారు.

రైతులు ఒంటరిగా వెళ్లొద్దు: డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి

మండలంలోని కొత్తపల్లి, బొమ్మారెడ్డిపల్లి గ్రామాల రైతులు తమ పంటపొలాల వద్దకు ఒంటరిగా వెళ్లరాదని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి సూచించారు. రెండు గ్రామాల గుట్టల్లో చిరుత సంచరిస్తున్నందున ఒకరు వెళ్తే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ విషయమై గ్రామంలో దండోరా వేయించాలని సర్పంచ్ కోమటిరెడ్డి లలితాబుచ్చిరెడ్డిని కోరినట్లు తెలిపారు. తమ ప్రాణాలకు హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే చిరుతకు కూడా ఎలాంటి ప్రాణహాని తలపెట్టరాదన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పరిశీలిస్తున్న డాక్టర్ రాజమౌళి

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రాజమౌళి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జవహర్‌నగర్‌లో ఒకరికి డెంగీ పాజిటివ్ రావడంతో సదరు వ్యక్తి ఇంట్లో.. చుట్టుపక్కల ప్రాంతంలో స్ప్రే చేయించారు. సీహెచ్‌ఓ ఉమా మహేశ్వర్ రావు, డాక్టర్లు చంద్రశేఖర్, శ్రావణ్ సూపర్‌వైజర్ వెంకట్ రెడ్డి, సత్యం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల్లో పట్టా భూమిగా మార్చండి



ట్యాంకుపై బాపూరావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల పట్టాభూమి అసైన్డ్ భూమిగా మారడంతో 200 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని సుల్తానాబాద్‌లో 10వ వార్డ్ కౌన్సిలర్ అనుముల్ల అరుణ భర్త బాపూరావు సోమవారం మిషన్ భగీరథ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. వివరాలు.. సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో గల 909 సర్వే నంబర్‌లో ఇళ్ల స్థలాలను 2007లో అప్పటి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో ఎక్కించారు. ప్రస్తుతం ధరణిలో అసైన్డ్ భూమిగా కనిపించడంతో స్థానికులు అమ్మకాలు, కొనుగోలు చేసేందుకు ఇబ్బందిగా మారింది. ఈనేపథ్యంలో బాపూరావు పలుసార్లు కలెక్టర్, ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించినా సవరణ చేయకపోవడంతో స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ట్యాంకుపైకి ఎక్కి నిరసన తెలిపాడు. కలెక్టర్ వచ్చేవరకు ట్యాంక్ దిగేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో ఫోన్‌లో మాట్లాడించి హామీ ఇవ్వడంతో ట్యాంక్ దిగాడు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

బాలపురస్కార్ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం అర్హత గల బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్ తెలిపారు. ఏటా ధైర్యసాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి తదితర అంశాల్లో ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు అవార్డులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 18 ఏళ్ల లోపు వయస్సుగల బాలబాలికలు ప్రతిభ కనబరిచిన వారు అర్హులని జిల్లా సంక్షేమ అధికారి పేర్కొన్నారు.

పొగాకు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

● అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పొగాకు నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అధికారులను ఆదేశించారు. పొగాకు నియంత్రణకు చేపట్టిన చర్యలపై సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. పొగాకు నియంత్రణ, ఉత్పత్తుల విక్రయాలపై తీసుకోవాల్సిన చర్యలపై డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్ వివరించారు.

మైనర్లకు అమ్మితే చర్యలు

మైనర్లకు పొగాకు తయారీ వస్తువులను అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని అరుణశ్రీ అన్నారు. పిల్లల ప్రవర్తనపై కుటుంబ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సిగరెట్, బీడీ పొగాకుకు సంబంధించిన వాటికి బానిసలవుతున్నారా..అనే విషయాన్ని గమనించేలా కుటుంబ పెద్దలకు సైతం అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పాఠశాలలకు సమీపంలో ఉన్న కిరాణ, పాన్ షాపులను తనిఖీ చేయాలన్నారు. డీఈఓ మాధవి, ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ మధుకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కార్తీక్ రెడ్డి, ఎస్‌టీఓ గోవర్ధన్, రెడ్‌క్రాస్ జిల్లాకన్వీనర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి



శివప్రసాద్ మృతదేహం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతు దాసరి శివప్రసాద్ (33) సోమవారం కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. శివప్రసాద్ పొలం వద్ద గల వ్యవసాయ మోటారు కనెక్షన్ వైరు తెగి ఉండడాన్ని గమనించక కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సివిల్ డిపార్ట్‌మెంట్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆర్జీ–2 డివిజన్ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు గత మూడేళ్ల నుంచి సీఎంపీఎఫ్ చిట్టీలు పంపిణీ చేయకుండా సింగరేణి యాజమాన్యం కాలయాపన చేయడంపై మండిపడ్డారు. కొత్త సర్క్యులర్‌లు తెచ్చి కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఒక రోజు విధులకు హాజరుకాకుంటే మస్టర్లపై రూ.300 వరకు కటింగ్ చేయడం సరికాదన్నారు. వెంటనే ఇలాంటి చర్యలు మానుకోవాలని, చట్టపరమైన హక్కులను కాంట్రాక్ట్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే అన్ని విభాగాల కార్మికులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో శ్రీను, కుమార్, మల్లేశ్, ఓదెలు, రాజు, సమ్మయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియాను నంబర్‌వన్‌గా నిలపాలి

● ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ



జీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): ఉత్పత్తి లక్ష్యాల సాధనలో సింగరేణిలోనే ఆర్జీ–2 ఏరియాను నంబర్‌వన్‌గా నిలపాలని జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం జీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సంస్థను అభివృద్ధి పథంలో నిలపడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం అధికారుల సంఘం నాయకులు, ఆర్జీ–2 జీఎం కార్యాలయం అధికారులు, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, డీజీఎం సివిల్ ధనుంజయ, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలి

గోదావరిఖని(రామగుండం): కోలిండియా మాదిరిగా సింగరేణి కార్మికులకు ఒకేసారి వేతన బకాయిలు చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం జీడీకే–5 ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులకు 23నెలల వేజ్ బోర్డు ఏరియర్స్ రావాల్సి ఉందని, వీటిని కోల్ ఇండియా మాదిరిగా ఆగస్టు వేతనాలతో కలిపి సెప్టెంబర్‌లో చెల్లించాలన్నారు. ఇంతవరకు దీనిపై సింగరేణి యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఈ విషయంలో కొన్నిరోజుల నుంచి సంస్థ వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నామన్నారు. అయినా యాజమాన్యం నిర్ణయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈనెల 25 నుంచి 27 వరకు గోదావరిఖనిలో జరుగనున్న యూనియన్ కేంద్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు రంగు శ్రీనివాస్, మాదన మహేష్, వెంకట్‌రెడ్డి, ప్రభుదాస్, చీకటి అంజయ్య, చెప్యాల భాస్కర్, బుర్ర భాస్కర్ పాల్గొన్నారు.

హక్కుల సాధన టీబీజీకేఎస్‌తోనే సాధ్యం



కార్మికులతో మాట్లాడుతున్న శంకరయ్య

రామగిరి(మంథని): సింగరేణి కార్మికుల హక్కుల సాధన కేవలం టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య అన్నారు. సోమవారం ఏపీపీ గని కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్మికులకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్న సంఘం టీబీజీకేఎస్ అని, జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వపు ఉద్యోగాలను సీఎం కేసీఆర్ కారుణ్య నియామకాల ద్వారా సంస్థలో 15 వేల మందికి తిరిగి అందజేస్తున్నారని తెలిపారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, 190 మస్టర్లు నిండిన ఏడాదిలోపే బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్‌లుగా రెగ్యులరైజేషన్ చేసేలా యాజమాన్యంతో పోరాటం చేశామన్నారు. సంస్థను ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన కుట్రలను సీఎం కేసీఆర్ తిప్పికొట్టారని పేర్కొన్నారు. టీబీజీకేఎస్‌ను విమర్శించే అర్హత జాతీయ సంఘాలకు లేదన్నారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ దాసరి మల్లేష్, నాయకులు దుగ్యాల నరేష్, శంకర్, శ్రీనివాస్, కనకయ్య, రేండ్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న జీఎం సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. జీఎంను అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట డీజీఎం సివిల్ ధనుంజయ్, డీజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, జేఈ సివిల్ రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు నల్లా మనోహర్‌రెడ్డి గుడ్‌బై

● ఎన్నికల్లో పోటీచేస్తానని వెల్లడి



మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అసెంబ్లీ అభ్యర్థిత్వాన్ని ఆశించి భంగపడిన బీఆర్‌ఎస్ నేత నల్లా మనోహర్‌రెడ్డి సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల్లో పెద్దపల్లి అసెంబ్లీ నుంచే పోటీచేస్తానని వెల్లడించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో మూడోసారి కూడా దాసరి మనోహర్ రెడ్డికే టికెట్ కేటాయించడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 15 ఏళ్లుగా పార్టీలో ఉంటూ.. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానని, పార్టీ అధిష్టానానికి విధేయుడిగా ఉంటున్న తనకు అవకాశం ఇవ్వకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే రెండుసార్లు దాసరికి అవకాశం ఇచ్చారని, వయోభారంతో ఉన్న ఆయనకు మళ్లీ టికెట్ ఇవ్వడం సరికాదని తెలిపారు.



బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ సంబరాలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీలో సోమవారం బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. రానున్న ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోరుకంటి చందర్‌కు పార్టీ టికెట్ కేటాయించడంతో కాలనీ బీఆర్‌ఎస్, ఆర్జీ–2 ఏరియా టీబీజీకేఎస్ నాయకులు బాణసంచా కాల్చారు. కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, కార్పొరేటర్ సాగంటి శంకర్, కాలనీ పట్టణ అధ్యక్షుడు మేడి సదయ్య, నాయకులు రాంచందర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారు

● మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తుండడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే అధికారం కట్టబెట్టాలనే నిర్ణయానికి వచ్చారని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పథకాల ఆశ చూపి ప్రజలపై పన్నుల భారాన్ని మోపిన మోసపూరిత బీఆర్‌ఎస్ సర్కార్‌కు అంతిమ ఘడియలు సమీపించాయన్నారు. నాయకులు నాగపురి తిరుపతి, పోచం, సత్యనారాయణ, రాజు, రంగు సంపత్, ఆంజనేయులు, మధునయ్య, నర్సయ్య, అంజయ్య, చారీ, రాజమౌళి, అనిల్, పర్శ రాములు, కుమార్, వంశీ తదితరులున్నారు.

మాట్లాడాలని పిలిచి.. కర్రలతో కొట్టి..



సతీశ్(ఫైల్)

మెట్‌పల్లి(కోరుట్ల): ఆదివారం రాత్రి సుమారు 11.30గంటల సమయం.. మెట్‌పల్లి పట్టణ శివారులోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ అది.. దాని చెంతనే నిర్మానుష్య ప్రదేశం.. ఇద్దరు స్నేహితులు కస్నం సతీశ్, నిఖిల్ అక్కడ కూర్చొని ఏదోవిషయంపై మాట్లాడుకుంటున్నారు.. సరిగ్గా అదే సమయంలో ఇద్దరు అక్కడకు చేరుకున్నారు.. సతీశ్‌ను తమ వద్దకు రావాలని పిలిచారు. వారి వద్దకు వెళ్లిన సతీశ్ భుజంపై చెయ్యి వేసి కొద్దిదూరం నడుచుకుంటూ తీసుకెళ్లారు.. ఆ వెంటనే ఒక్కసారిగా దాడికి దిగారు.. అప్రమత్తమైన సతీశ్.. వారిబారి నుంచి తప్పించుకునేందుకు యత్నించాడు.. నిఖిల్ అడ్డుకునేందుకు యత్నించగా.. దుండగులు చంపుతామని బెదిరించి అక్కడి నుంచి పంపించి వేశారు. గాయాలతో పారిపోతున్న సతీశ్‌ను వెంబడించి మరీ పట్టుకొని కట్టెలు, ఇటుకలతో విచక్షణ రహితంగా కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు.. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడిఉన్న సతీశ్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. నాలుగు రోజుల క్రితమే కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడు రజాక్ కూడా హత్యకు గురయ్యాడు. ఈ కేసుపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ సమయంలోనే సతీశ్ హత్యకు గురికావడం అలజడి సృష్టించింది. ప్రశాంతంగా ఉన్న పట్టణంలో వరుస హత్యలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.

ఆ సంఘటనే కారణమా?

- పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సతీశ్(27)కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకరి వయసు ఏడాదిన్నర కాగా, మరొకరి వయసు రెండు నెలలు.
- జక్కం రాజేశ్, నవీన్ కలిసి సతీశ్‌పై దాడిచేసి చంపారని ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటస్వామి సోమవారం విలేకరులకు తెలిపారు.
- అయితే.. పాత పగతోనే రాజేశ్ తన మిత్రుడు నవీన్‌తో కలిసి సతీశ్‌ను హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.
- ఐదేళ్ల క్రితం స్థానిక మినీస్టేడియంలో రాజేశ్, సతీశ్ వర్గాల మధ్య ఓ విషయంలో ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.
- చాలారోజుల తర్వాత రాజేశ్ కోలుకున్నాడు. అప్పటి నుంచి సతీశ్‌పై కక్ష పెంచుకున్నాడు. అదను చూసి హతమార్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.
- కేవలం ఈ గొడవేనా.. ఇంకా ఏదైనా కారణం ఉందా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు.